క్లుప్తంగా

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు ఇష్టపడి చదవాలని స్థానిక శాఖాగ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల బుక్‌కీపింగ్ సెంటర్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను విరివిగా చదవాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకుని అన్ని రకాల పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మహనీయుల చరిత్ర, జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

భైరవకోనలో విద్యార్థుల సందడి



భైరకవకోన జలపాతం నీటిలో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం, పుణ్యక్షేత్రం భైరవకోనలో ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విహారయాత్రకు వచ్చి సందడి చేశారు. ముందుగా జలపాతంలో స్నానాలు చేసి కేరింతలు కొట్టిన విద్యార్థులు.. త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా గడిపారు. దేవస్థాన ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు వసతులు, అన్నప్రదాసం విద్యార్థులకు సమకూర్చారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పామూరు: మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు గ్రామ సమీపంలోని పొల్లాల్లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. వారి నుంచి రూ.8,430 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాలపొంగళ్లు

పామూరు: మండలంలోని రేణిమడుగులో ఆదివారం అంకాల పరమేశ్వరీదేవి ఆలయ 3వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని లక్ష్మీదేవి, సరస్వతిదేవి సమేత అంకాల పరమేశ్వరీదేవి మూల విగ్రహమూర్తులకు విశిష్ట పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



మాట్లాడుతున్న ఎంఈఓల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి

కనిగిరిరూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, శ్రీసాయి కృష్ణ దివ్యాంగుల ఆశ్రమం మొదటి వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు దోసపాటి నరసయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఉన్నతమైన శక్తి కలిగిన వారన్నారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, న్యాయవాది శివరామకృష్ణారెడ్డి, ఆరు మండలాల దివ్యాంగుల సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుత్తి శ్రీధర్‌కు జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న గుత్తి శ్రీధర్

కనిగిరిరూరల్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కనిగిరికి చెందిన గుత్తి శ్రీధర్‌కు జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లారాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రమణియన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సేవకులు, కవులు, రచయితలు, సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలకు అందజేసే అవార్డు ఈ ఏడాది తనకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత గుత్తి శ్రీధర్ తెలిపారు.



మండల కేంద్రమైన వలేటివారిపాలెం సచివాలయం పరిస్థితి



సిబ్బంది లేని చుండి సచివాలయం

గ్రామ సేవలు బంద్

- సచివాలయాల్లో సిబ్బంది కొరత
- నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యానికి తూట్లు
- ఇష్టం వచ్చినట్లు బదిలీలు

వలేటివారిపాలెం:

సచివాలయాల సిబ్బంది కొరతతో మండలంలోని ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఎవరికీ పట్టడంలేదు. ప్రస్తుతం సచివాలయాలన్నీ గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారాయి. గతంలో 2019–24 ప్రభుత్వ హయాంలో మండలంలోని 21 పంచాయతీల్లో 15 సచివాలయాలుగా ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయానికి గత ప్రభుత్వం కోటి రూపాయల ఖర్చుతో భవనాలు నిర్మించింది. ఒక్కో సచివాలయానికి వివిధ శాఖలకు సంబంధించి 11 మంది ప్రభుత్వ సిబ్బందిని నియమించింది. ఈ 15 సచివాలయాల ప్రజలు మండలానికి రాకుండా ఆయా సచివాలయాల్లోనే ఆయా శాఖల అధికారులతో పనులు చేయించుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన.. ఉన్న సిబ్బందిని 8 నుంచి 9 మంది లెక్కన బదిలీ చేశారు. దానికి తోడు 21 పంచాయతీల్లో, 21 పంచాయతీలకు గాను ప్రస్తుతం 5 మంది సెక్రటరీలే పని చేస్తున్నారు. ఐదుగురులో ఒకరు చాలా రోజులు సెలవు పెట్టి విధులకు రావడంలేదు. ఈ నలుగురు సెక్రటరీలను షాడో ఎమ్మెల్యే సూచనలు మేరకు, ఎమ్మెల్యే మెప్పు కోసం స్థానిక ఎంపీడీఓ ఒక్కో సెక్రటరీని 5 నుంచి 7 పంచాయతీలుగా విభజించి విధులు అప్పగిస్తున్నారు. అదే విధంగా వ్యవసాయ సహాయకులను సంబంధం లేని శాఖలకు ఇన్‌చార్జులుగా నియమించారు. వ్యవసాయ సిబ్బంది సంబంధిత శాఖలపై అవగాహన లేకపోవడంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎంపీడీఓ నరేంద్ర దేవ్ మండల సభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేకు పంచాయతీ సెక్రటరీలు లేక ఇబ్బంది అవుతుందని చెప్పుకున్నారు. ఎమ్మెల్యే కూడా జిల్లా అధికారులతో నాలుగు సార్లు తెలయపరిచామని.. త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రస్తుతం సచివాలయాల్లో హెల్పర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్, మరో దగ్గర ఏఎస్ఎమ్, వీఆర్ఓ, సర్వేయర్ ఇలా 15 సచివాలయాల్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున 45 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న కొంత మందిలో అక్కడక్కడ మెడికల్ లీవుల్లో ఉన్నారు. సర్వేయర్‌లు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో 50 ఇళ్లకి ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి 6 గంటలకు పింఛన్ పంపిణీ చేసేవారు. కానీ ఇప్పుడు సిబ్బంది కొరతతో ఒక బజారున రచ్చబండ మీద కూర్చొని అక్కడే పంపిణీ చేయాల్సి వస్తోంది. మండలంలోని సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి పంచాయతీ సెక్రటరీలు లేకపోవడంతో బిల్లులు చేసేవారు లేక గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తం అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఉన్న నలుగురు సెక్రటరీలు ఏ సర్పంచ్‌తో సంప్రదించకుండా షాడో ఎమ్మెల్యే సూచనలు మేరకు విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఎక్కువ పంచాయతీలు ఉండటంతో ఏ పనికి పూర్తి న్యాయం చేయట్లేదు. 15 సచివాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనం ఇస్తున్నాయి. కొన్ని పంచాయతీల్లో సెక్రటరీలు అందుబాటులో లేకపోవడం వలన పారిశుద్ధ్య నిర్వహణ లోపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



బడేవారిపాలెం సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అమరజీవికి ఘన నివాళులు



పామూరులో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కందుకూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- కందుకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పించిన నాయకులు

కందుకూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పలువురు నాయకులు పాల్గొని అమరజీవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ప్రాణత్యాగం వలనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆ మహనీయుడి త్యాగాన్ని గుర్తు చేసుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావులకొల్లు బ్రహ్మానందం, గణేశం గంగిరెడ్డి, పాశం కొండయ్య, రేణమాల అయ్యన్న, వల్లూరి కోటేశ్వరరావు, షేక్ రహీం, కూరపాటి వెంకట్రామిరెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, ద్రోణాదుల చైతన్య, షేక్ రిజ్వాన్, జంగిలి ఇజ్రాయేల్, కొచ్చర్ల మాల్యాద్రి, శ్రీరామ కుమారస్వామి, ఎస్కే సుల్తాన్, కె.సుబ్బారావు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్‌కలాం, జి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: తెలుగు వారి కోసం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాముల వర్ధంతిని కందుకూరులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకురాలు నాగరాణి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం వచ్చిందన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి చివరికి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వదిలేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని అని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉలవపాడులో...

ఉలవపాడు: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఉలవపాడులోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి ఆత్మార్పణం చేసిన రోజును ప్రతిఒక్క ఆంధ్రుడు గుర్తుంచుకోవాలని అన్నారు. తెలుగు రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగం చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు శ్రీధర్, సుబ్రహ్మణ్యం, సత్యానారాయణ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు నివాళులు

గ్రంథాలయంలో...

ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శాఖా గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆయన చేసిన సేవల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు అంబటి కొండారెడ్డి, వాసవీక్లబ్స్ గవర్నర్ మంచికంటి రమేష్‌బాబు అన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాము వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధనకు అశువులు బాసిన మహోన్నతుడు పొట్టిశ్రీరాములు అన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తి కనిగిరి ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాసులు, షేక్.గయాజ్, గడ్డం వెంకట నారాయణరెడ్డి, దండు నారాయణ, రసూల్‌ఖాన్, షేక్.వసీం, షేక్.సోయల్, వాసవీక్లబ్ సభ్యులు శేగు క్రిష్ణయ్య, దరిశి మస్తాన్‌రావు, సువర్ణ, గురు, నరసింహారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షను గుర్తు చేసుకుని ఆయన త్యాగనిరతిని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సోమిశెట్టి వాసవీదేవి, సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి గుప్తా, షేక్ కరీం, దత్తు సుబ్బారావు, పాలూరి శ్రీనివాసులరెడ్డి, మామిడి హజరత్తయ్య, షేక్ సుల్తాన్, షేక్ రహీమ్, పి.శ్రీనివాసులరెడ్డి, మాదాల శంకర్ పాల్గొన్నారు.

మద్దిపాడు: పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు, గాంధీ మహాత్ముని విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అలవల నరసింహారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎంపీడీఓ జగదీష్, ఏఓ ఎస్కే ఖాశింపీరా, ఏపీఓ గడ్డం రాంబాబు, ఏఈ జాలయ్య, ఎస్కే షుఖూర్, వంశీ, అలవల హరిప్రసాదు, నరసింహారావు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. స్థానిక రామాలయం వీధిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు కనిగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం కనిగిరి వాసులకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, మాదాల సుబ్బారావు, దద్దాల రాములు, నాయకులు జి.ఆదినారాయణరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: అమరజీవి పొట్టిశ్రీరాముల త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని వాసవీ సత్ర సముదాయము జాతీయ అధ్యక్షులు దేవకీ వెంకటేశ్వర్లు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కనిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకీ శ్రీనివాసులు, టంగుటూరి గోవిందరావు, తడికమల్ల వెంకటేశ్వర్లు, రాచపూడి వెంకటేశ్వర్లు, బచ్చు వెంగళరావు, బచ్చు అంజయ్య, మాదాల సుబ్బారావు, వాగిచెర్ల వెంకటేశ్వర్లు, కొత్త రవి కుమార్, బింగి రాములు, ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.



కందుకూరు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథపాలకురాలు, విద్యార్థులు



ఉలవపాడు గ్రంథాలయంలో...



సింగరాయకొండలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



మద్దిపూడిలో నివాళులర్పిస్తున్న నేతలు



కనిగిరిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గఫార్, కస్తూరిరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి

అంజిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

- డాక్టర్ మాదాసి వెంకయ్య

మద్దిపూడి: వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ తూగుట్ల అంజిరెడ్డి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అన్నారు. మండలంలోని చిమట పంచాయతీ తూగుట్లవారిపాలెం గ్రామానికి చెందిన తూగుట్ల అంజిరెడ్డి (48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ మాదాసి వెంకయ్య ఆదివారం గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. అంజిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, బోద రమణారెడ్డి, సర్పంచ్ పులిచర్ల లక్ష్మమ్మ, రామిరెడ్డి, వీరెళ్ల చెన్నపనాయుడు, ఎం రమణయ్య, తూగుట్ల చిన కొండారెడ్డి, తూగుట్ల బిక్షాల్‌రెడ్డి, క్రిష్టపాటి సుబ్బారెడ్డి ఉన్నారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య, ఇతర నేతలు

వైభవంగా గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి విగ్రహమూర్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమలనాథస్వామి ఆలయంలో అర్చకులు రామ్మూర్తి విశిష్ట పూజలు నిర్వహించి స్వామి మూల విగ్రహమూర్తులకు విశిష్టంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాశీనాయన ఆరాధన మహోత్సవం



ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ

కనిగిరిరూరల్: స్థానిక కొత్తపేట 16వ వార్డులో కొలువై ఉన్న భగవాన్ కాశీనాయన స్వామి ఆశ్రమంలో 29వ ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరెడ్డి పాల్గొని స్వామికి విశిష్ట పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కౌన్సిలర్ పులి విజయలక్ష్మి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీ పెద్దన్నపాలెం వద్ద ఆదివారం రాత్రి కోడిపందెం శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో ఐదుగురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 2 కోళ్లను రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. కోడి పందెం, పేకాట, అసాంఘిక కార్యకలాపాలు, రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

18న ఉపాధి పనులపై ప్రజావేదిక

మద్దిపూడి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఈ నెల 18న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 21 పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జరిగిన పనులపై ఈ నెల 2 తేదీ నుంచి సామాజిక తనిఖీ చేపట్టి గ్రామ సభలు నిర్వహించామన్నారు. ఈ నెల 18న స్థానిక స్త్రీ శక్తి భవనం ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

జరుగుమల్లి(సింగరాయకొండ): గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే విధానంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. శిక్షణ రెండు విడతలుగా జరుగుతుందని, మొదటి విడతలో చతుకుపాడు, చింతలపాలెం, చిర్రికూరపాడు, దావగూడూరు, కె బిట్రగుంట, కామేపల్లి, నందనవనం, నర్సింగోలు, రామచంద్రాపురం, అక్కచెరువుపాలెం రెండో విడతలో పైడిపాడు, రెడ్డిపాలెం, పాలేటిపాడు, పచ్చవ, వర్ధినేనివారిపాలెం, ఎస్ఎస్ కండ్రిక, వావిలేటిపాడు, ఎడ్లూరుపాడు, జరుగుమల్లి, తూమాడు గ్రామాల అధికారులు పాల్గొనాలని సూచించారు. మొదటి విడత 16,17 తేదీల్లో, రెండవ విడత 18, 19వ తేదీల్లో జరుగుతుందన్నారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్, వెల్ఫేర్, మత్స్యశాఖ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

ఉలవపాడు: మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. ఈ నెల 25వ తేదీ క్రిస్మస్ పండుగ సందర్భంగా పది రోజుల ముందు నుంచే సందడి నెలకొంది. ఏసుక్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలు పెద్ద ఎత్తున జరుపుకునేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గత నెల 25వ తేదీ నుంచి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో పెద్ద పెద్ద క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ లైట్లతో కూడిన స్టార్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 12 పంచాయతీలలో క్రిస్మస్ పండుగ జరుపుకునేందుకు ప్రధాన చర్చిలలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. చర్చిలతో పాటు గృహాలపై కూడా స్టార్లు ఏర్పాటు చేశారు.

దిగ జారిన నిమ్మ ధరలు



వ్యాపారుల వద్దకు వచ్చిన నిమ్మ కాయలు

హనుమంతునిపాడు: నిమ్మ ధరలు పాతాళంలోకి పడిపోయాయి. దీంతో కనీసం కోత, బాడుగ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. నిమ్మకాయలకు ఆది నుంచి రూ.50లకు మించి ధర పలకడం లేదు. దీంతో సీజన్ ప్రారంభం నుంచే రైతులకు లాభాలు వచ్చింది లేదు. తోటలు దెబ్బతినకుండా వచ్చిన కాయను కోసి వ్యాపారులు అడిగి ధరకే రైతులు విక్రయించాల్సి వస్తోంది. దీంతో నిన్న మొన్నటి వరకు రూ.25 నుంచి రూ.30లకు అమ్మిన నిమ్మకాయలు ప్రస్తుతం రూ.15లకు పడిపోయింది. పండు కాయ లైతే కిలో రూ.2కు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తీవ్ర నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని రైతులు తిరుపతిరెడ్డి, మామిరెడ్డి, గాయం వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పండి పోయిన నిమ్మకాయలు

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జూనియర్ బాలకల కబడ్డీ జట్టు

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా జూనియర్ బాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. వీరు ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య వివరించారు.

జట్టు సభ్యులు: వి.అర్చన, కె.భూమిక, కె. నందిని, కె. విజయలక్ష్మి, కె.త్రిగుణ, కె.సిపోరా, వి.కార్తీక, పి. స్వాతి, వి. ధనలక్ష్మి(పాకల), కె. నిరీష(కరేడు), కె. పుష్ప, కె. గాయత్రి(వేటపాలెం), డి. హాసన్‌బీ(మార్కాపురం), డి. జోత్స్నప్రియ(పైడిపాడు), ఏసాయిలత(చీమకుర్తి),

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయ పడిన భార్య భర్తలు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండల పరిధిలో హైవే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు..పొన్నలూరు మండలం కోటపాడు అగ్రహారం గ్రామానికి చెందిన వై.చిన్నపరెడ్డి, ఆయన భార్య పద్మ ద్విచక్రవాహనంపై పొదిలి వెళుతున్నారు. ఈ క్రమంలో నందనమారెళ్ల వద్ద హైవే రోడ్డులో పొదిలి వైపు నుంచి ఎదురుగా వస్తున్న కంకర లారీ..ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో చిన్నపరెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా..భార్య పద్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.